
సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం । 6 । మే । 2024



ప్రశాంతంగా నీట్
దేశంలోని వైద్య విద్యా కళాశాలల్లో ప్రవేశాల నిమిత్తం నిర్వహించే నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్) ఉమ్మడి జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. 8లో ▸



వలసల జోరు
సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సమయం దగ్గర పడుతున్న కొద్దీ వైఎస్సార్‌సీపీలోకి వలసలు జోరందుకున్నాయి. ఇతర పార్టీల నేతలు భారీగా వచ్చి చేరుతున్నారు. 8లో ▸



జాతీయ పోటీలకు ఎంపిక
జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఏలూరుకు చెందిన నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారని ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కోశాధికారి తెలిపారు. 8లో ▸

న్యూస్‌రీల్

స్ట్రాంగ్‌రూమ్ పరిశీలన



స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి సంబంధించి పట్టణంలోని తేతలి సత్యనారాయణమూర్తి జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న కమిషనింగ్ ప్రక్రియను ఆదివారం కలెక్టర్ సుమిత్‌కుమార్, ఆర్‌ఓ కె.చెన్నయ్య పరిశీలించారు. స్ట్రాంగ్‌రూమ్‌ను కలెక్టర్ పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు.

తణుకులో..

తణుకు: తణుకు నియోజకవర్గ పరిధిలో ఎన్నికల ఏర్పాట్లను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. స్థానిక జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో భద్రపరిచిన ఈవీఎంలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అనంతరం ఈనెల 6, 7 తేదీల్లో జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. కలెక్టర్ వెంట ఎన్నికల రిటర్నింగ్ అధికారి బీవీ రమణ, అధికారులు ఉన్నారు.

ఉద్యోగుల ఓటు హక్కు తిరస్కరించొద్దు

ఉండి: ఎన్నికల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు ఎట్టి పరిస్థితుల్లోను ఓటు హక్కును తిరస్కరించవద్దని జాయింట్ కలెక్టర్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సీవీ ప్రవీణ్ ఆదిత్య ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధుల్లో ఉన్న కొందరు ఉద్యోగులు ఫారం–12ను సకాలంలో సమర్పించకపోవడం వల్ల ఓటు వినియోగించుకోలేకపోతున్నారనే విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. స్పాట్‌లోనే ఫారం–12 స్వీకరించి ఓటు హక్కు కల్పించాలని తెలిపారు. అనివార్య కారణాల వల్ల ఎన్నికల విధుల్లో ఉన్న ఓటరు ఈనెల 1వ తేదీ నాటికి ఫారం–12ను సమర్పించలేకపోతే ఏ ఆర్వో పరిధిలో ఆ ఉద్యోగి ఓటరుగా నమోదు అయ్యారో ఆ ఆర్వోకు ఫారం–12 సమర్పించేందుకు, ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అనుమతించాలని ఆదేశించారు. ఈనెల 7,8 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫెసిలిటేషన్ కేంద్రాలు పనిచేస్తాయని తెలిపారు. ఉద్యోగులు ప్రత్యేక సెలవును సద్వినియోగం చేసుకుని పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలన్నారు. అర్హులంతా ఓటు హక్కు వినియోగించుకునేలా ఆర్వోలంతా సహకరించాలని కోరారు. ఈసీఐ మార్గదర్శకాలను అనుసరించడంలో తేడాలు వస్తే సంబంధిత ఆర్వోలు బాధ్యత వహించాల్సి ఉంటుందని, క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఎన్నికల సాధారణ పరిశీలకులు

ఏలూరు(మెట్రో)/ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని ఎన్నికల సాధారణ పరిశీలకులు డా.కృష్ణకాంత్ పాఠక్, ఎస్‌ఏ రామన్ అన్నారు. ఆదివారం స్థానిక సీఆర్‌ఆర్ కళాశాల ఆడిటోరియంలో మైక్రో అబ్జర్వర్లకు నిర్వహించిన రెండో విడత శిక్షణా కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఉంగుటూరు, దెందులూరు, ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల సాధారణ పరిశీలకులు కృష్ణకాంత్ పాఠక్ మాట్లాడుతూ నిఘా నేత్రాలతో పరిశీలిస్తూ తప్పిదాలు, ఉల్లంఘనలు సంభవిస్తే వెంటనే ఎన్నికల పరిశీలకులు దృష్టికి తేవాలన్నారు. పోలింగ్ కేంద్రంలో, పీఓ, ఏపీఓలు నిర్వహిస్తున్న విధులను, ఓటింగ్ తీరును నిశితంగా పరిశీలించాలన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలన్నారు. విధి నిర్వహణలో అనుమానాలు ఉంటే సెల్ 9154690377 నంబర్‌కు తెలియజేయాలన్నారు.

జంపింగ్ జపాంగ్

పార్టీలు మారడంలో దిట్ట

ప్యారాచుట్ నేత అంజిబాబు
- ఇప్పటికే కాంగ్రెస్, టీడీపీలకు ఝలక్
- ఈసారి భీమవరం జనసేన అభ్యర్థిగా పోటీ
- కేడర్‌ను పట్టించుకోని పులపర్తి
- ఓడిపోతే తమ పరిస్థితి ఏంటని జనసేన శ్రేణుల ఆందోళన
- అంటీముట్టనట్టుగా టీడీపీ, బీజేపీ నేతలు
- గతంలో ఎమ్మెల్యే పదవిని అడ్డం పెట్టుకుని కాంట్రాక్టర్ అవతారం
- మున్సిపల్ స్థలంలో పార్కింగ్ ఫీజుల వసూళ్లు
- కరోనా సమయంలో ప్రజలను కన్నెత్తి చూడని వైనం



సాక్షి, భీమవరం: పార్టీతో, కేడర్‌తో ఆయనకు పనుండదు.. అధికారమే పరమావధి.. పరాజయం చెందితే తనను నమ్మి ఓట్లేసిన ప్రజల కంటికే కనిపించరు.. అందుకే ఆయన్ను ఏరుదాటాక తెప్ప తగలేసే రకమని కొందరు.. ప్యారాచూట్ నేతని మరికొందరు చెప్పుకుంటుంటారు. స్వతహాగా వ్యాపారంలో రాణించిన ఆయన రెండు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసి మరింత వెనకేసుకున్నారంటారు. చివరకు తన మల్టీప్లెక్స్ ఎదురుగా ఉన్న మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించి కోట్లాది రూపాయల పార్కింగ్ ఫీజు రూపంలో ప్రజల నుంచి వసూలు చేసిన ఘనుడిగా పేరొందారు భీమవరం జనసేన పార్టీ అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు).

కండువాలు మారుస్తూ..

కృష్ణా జిల్లాకు చెందిన అంజిబాబు భీమవరంలో స్థిరపడ్డారు. వ్యాపారవేత్తగా ఉన్న ఆయన 2009లో దివంగత వైఎస్సార్ చలవతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీలో నిలిచారు. కాంగ్రెస్ కేడర్ ఆయన విజయానికి శక్తివంచన లేకుండా పనిచేసింది. ఐదేళ్లపాటు ఎమ్మెల్యేగా ఉన్నా నియోజకవర్గ ప్రజలకు ఉపయోగపడింది అంతంతమాత్రమే. ప్రభుత్వం మంజూరుచేసిన అభివృద్ధి పనులకు కాంట్రాక్టర్ ఆయనే. బినామీ పేర్లతో అన్ని పనులు ఆయన కనుసన్నల్లోనే జరిగేవి. కాంగ్రెస్ కేడర్‌ను గాలికొదిలేసి 2014 ఎన్నికల్లో పార్టీ ఫిరాయించారు. టీడీపీ అభ్యర్థిగా సీటు తెచ్చుకోగా ఆ పార్టీ శ్రేణులు ఆయన కోసం పనిచేశాయి. అనంతరం 2019 ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీచేసిన అంజిబాబుకు వైఎస్సార్‌సీపీ ప్రభంజనంలో ఘోర పరాజయం తప్పలేదు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్‌పై **ఓటమి చెందిన పులపర్తి ఐదేళ్లుగా టీడీపీకి, ప్రజలకు దూరంగా ఉన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో కూటమి పొత్తులో భాగంగా భీమవరం సీటు జనసేనకు రావడంతో ఒక్కసారిగా ఆ పార్టీ కండువా కప్పుకుని మరోమారు తెరపైకి వచ్చారు. జనసేన** అభ్యర్థిగా రంగంలోకి దిగారు.

ప్రజలను పట్టించుకోలేదు : గత ఎన్నికల్లో ఓటమి అనంతరం టీడీపీ శ్రేణులకు, తనను నమ్ముకుని ఓటేసిన ప్రజలకు ముఖం చూపించకుండా చక్కగా తన వ్యాపార వ్యవహారాల్లో మునిగిపోయారు. కరోనా మహమ్మారితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమయంలోనూ నియోజకవర్గ ప్రజల వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు అండగా కనీసం సేవా కార్యక్రమాలు నిర్వహించలేదు. మరలా ఎన్నికలు రావడంతో ఇప్పుడు గుర్తొచ్చామా అని పులపర్తిపై ప్రజలు మండిపడుతున్నారు.

మింగుడుపడని వైఖరి

పులపర్తి వైఖరి టీడీపీ, జనసేన, బీజేపీ కేడర్‌కు మింగుడుపడటం లేదు. ఏ పార్టీ నుంచి పోటీ చేసినా అంజిబాబు పార్టీ పటిష్టతకు, నాయకులు, కార్యకర్తల బాగోగులు గురించి పట్టించుకోరన్న పేరుంది. తన వెన్నంటి ఉన్న పార్టీ నేతలు, కార్యకర్తలను కనీసం సంప్రదించకుండా ఆయన పార్టీ మారిపోతుంటారంటారు. గత అనుభవాల దృష్ట్యా ఇప్పటికే టీడీపీ నాయకులు ఆయనతో అంటీముట్టనట్టు వ్యవహరిస్తున్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షురాలిగా ఉన్న పొలిట్‌బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మితో పాటు పలువురు ముఖ్య నేతలు ఆచితూచి వ్యవహరిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. మరోపక్క జనసేన కేడర్ ఎన్నికల్లో తేడా వస్తే తమ పరిస్థితి ఏంటన్న ఆలోచనలో ఉన్నారంట.

వ్యాపార ప్రయోజనాలకే ప్రాధాన్యం

పదేళ్ల పాటు భీమవరం ఎమ్మెల్యేగా పనిచేసిన అంజిబాబుకు తన వ్యాపార ప్రయోజనాలే ప్రధానమని నియోజకవర్గ ప్రజలు అంటున్నారు. ఆయన అధికారంలో ఉన్న సమయంలో కాంట్రాక్టర్‌గా వందల కోట్లు వెనకేసుకున్నారంటారు. మొదటిసారి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తీర ప్రాంత ప్రజలకు రక్షిత నీటిని అందించేందుకు సంకల్పించిన ప్రాజెక్టు విషయంలోనూ వ్యాపార ధోరణి చూపించారంటారు. ప్రాజెక్టు కోసమని భీమవరం రూరల్ మండలం చిన అమిరంలో సుమారు 50 ఎకరాల భూమిని రైతుల నుంచి తక్కువ ధరకు సేకరించి తన సొంతానికి వినియోగించుకున్నారన్న ఆరోపణలు ఆయనపై ఉన్నాయి. భీమవరంలోని తన మల్టీప్లెక్స్ వద్ద ఆర్ అండ్‌బీ, మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించుకుని దర్జాగా పార్కింగ్ ఏర్పాటుచేసి పదేళ్ల పాటు కోట్లాది రూపాయలు ప్రజల నుంచి వసూలు చేశారు. 2019లో భీమవరం ఎమ్మెల్యేగా ఎన్నికైన గ్రంధి శ్రీనివాస్ కన్నెర్రజేయడంతో పార్కింగ్ ఫీజు అక్రమ వసూళ్లకు తెరపడింది.

1,088 మంది హోమ్ ఓటింగ్



ఉండి మండలం ఆరేడులో హోమ్ ఓటింగ్‌ను నిర్వహిస్తున్న ఎంపీడీఓ రవీంద్ర

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో మూడు రోజులపాటు నిర్వహించిన హోమ్ ఓటింగ్‌లో వృద్ధులు, దివ్యాంగులు 1,088 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, 40 శాతం పైబడి వైకల్యం ఉన్న దివ్యాంగులు మొత్తం 1,118 మంది హోమ్ ఓటింగ్‌కు అర్హులు కాగా గడువు ముగిసే నాటికి 1,088 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. 30 మంది ఓటర్లు అనివార్య కారణాలతో ఓటు వేయలేకపోయారన్నారు. సోమ, మంగళవారాల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను నియోజకవర్గాల వారిగా ఏర్పాటుచేసిన ఫెసిలిటేషన్ సెంటర్లలో నిర్వహిస్తామన్నారు. అలాగే సర్వీస్ ఓటర్లుగా నమోదైన 888 మందికి పోస్టల్ బ్యాలెట్‌ను పంపామని, వారు ఓటింగ్ అనంతరం పోస్టల్ బ్యాలెట్‌ను తిరిగి తమకు పంపిస్తారని కలెక్టర్ వివరించారు.

శ్రీవారి సేవలో అర్జున అవార్డు గ్రహీత

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని అర్జున అవార్డు గ్రహీత, డిప్యూటీ కలెక్టర్ వి.జ్యోతి సురేఖ ఆదివారం సందర్శించారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి విచ్చేసిన ఆమె స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

జగన్‌తోనే దళితులకు సముచిత స్థానం

శాసనమండలి ఛైర్మన్ మోషేన్‌రాజు



దళిత, క్రైస్తవ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

ఆకివీడు: ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపడితేనే దళిత, క్రైస్తవ, పేద వర్గాల అభివృద్ధి సాధ్యమని శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. స్థానిక రైస్‌మిల్లర్స్ భవనంలో ఆదివారం దళిత, క్రైస్తవ ఆత్మీయ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రంలో దళితులకు సముచిత స్థానాన్ని సీఎం జగన్ కల్పించారన్నారు. దళితులు, క్రైస్తవులకు పలు పదవుల్ని ఇచ్చి ఉన్నత స్థితికి తీసుకువెళుతున్నారన్నారు. దళిత బిడ్డలు ఉన్నత చదువులు చదవాలంటే జగన్‌నే గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. విద్య, వైద్యం, ఆరోగ్యం వంటి పథకాలతో దళితులు ఉన్నత స్థితికి చేరుకుంటున్నారని చెప్పారు. దళిత, పేద పిల్లలు టై, బెల్టు ధరిస్తున్నారంటే, ప్రభుత్వ పాఠశాలల్లోనే ఇంగ్లిష్ మీడియం చదువుతున్నారంటే అదంతా జగన్ కృషి అన్నారు. దళితులు, క్రైస్తవులు సంఘటితంగా జగన్ గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఎవరికో ఓటు వేస్తే, ఉండి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు గెలుస్తారనుకోవడం సరికాదన్నారు. గత 59 నెలల కాలంలో సీఎం జగన్ నా ఎస్సీలు, నా బీసీలు, నా మైనార్టీలు అంటూ ఆయా వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించారన్నారు. ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు అంబటి రమేష్ మాట్లాడుతూ దళితులు, క్రైస్తవులు, బీసీ, పేద, అన్నివర్గాల ప్రజలు జగన్‌ను మళ్లీ సీఎంను చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అయిభీమవరం సర్పంచ్ గాలి సామ్రాజ్యం, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పళ్లెం అరుణకుమారి, నగర పంచాయతీ వైస్‌ఛైర్మన్ వంగా జ్యోత్స్న, కౌన్సిలర్ కటికతల జాన్ వెస్లీ, సువర్ణరాజు, మెడవంకల రవికుమార్, సర్పంచ్‌లు సీహెచ్ చిట్టిబాబు, నందమూరి ప్రకాశం, ఎరిచర్ల సాంబర్లిన్, మద్దా జ్ఞాన్‌రాజు, పాస్టర్ జ్ఞాన్ ప్రకాష్, ఏలియ్య, కమతం మహేష్, అద్దంకి ప్రసాద్, పలువురు పాస్టర్లు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

గూడెంలో మరింత అభివృద్ధి

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: మరో ఐదేళ్లలో తాడేపల్లిగూడెంను అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దనున్నట్టు ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి, వైఎస్సార్‌సీపీ తాడేపల్లిగూడెం అసెంబ్లీ అభ్యర్థి కొట్టు సత్యనారాయణ చెప్పారు. స్థానిక కొండయ్య చెరువు వద్ద రజక సంఘ భవనంలో ఆదివారం ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004లో తాను తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన సందర్భంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గాన్ని రూ.600 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. రాష్ట్రంలో పులివెందుల తర్వాత తాడేపల్లిగూడెం నియోజకవర్గం అభివృద్ధి పథంలో రెండో స్థానంలో ఉన్నట్టు మీడియా కూడా కొనియాడిందని గుర్తు చేశారు. 2019లో రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచి 2024 వరకు సుమారు రూ.1,100 కోట్ల అభివృద్ధి పనులు మంజూరు చేశామన్నారు. వాటిలో చిన్నపిల్లల మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, సెకండ్ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్, ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల, టూటౌన్‌లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం, రహదారులు, వంతెన నిర్మాణాలు, క్రికెట్ గ్రౌండ్, కాపు భవన్ వంటి పలు అభివృద్ధి పనులు ఉన్నాయన్నారు. ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరికలు ఆర్డీఓ కార్యాలయం, డీఎస్పీ కార్యాలయం, అదనపు జిల్లా కోర్టును ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 13న జరిగే పోలింగ్‌లో ఫ్యాను గుర్తుపై ఓటువేసి నియోజకవర్గంలో తనను, నరసాపురం ఎంపీ అభ్యర్థిగా గూడూరి ఉమాబాలను గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్, మారిశెట్టి సుబ్బారావు, ముప్పిడి వెంకటరామిరెడ్డి, శీరం దాసు అప్పారావు, నీలం వెంకటేశ్వరరావు, టేకి ధర్మారావు, దువాపు విఘ్నేశ్వరరావు, మాగపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ నిర్వహణకు సర్వం సిద్ధం

కలెక్టర్ సుమిత్‌కుమార్



విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ అజిత

భీమవరం: జిల్లాలో ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లతో సంసిద్ధంగా ఉన్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ అన్నారు. ఆదివారం భీమవరం కలెక్టరేట్‌లో ఎస్పీ వేజెండ్ల అజితతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోలింగ్ ప్రక్రియలో భాగంగా తొలిగా హోమ్ ఓటింగ్‌ను ప్రారంభించామని, ఆదివారంతో నూరు శాతం పూర్తి చేస్తున్నామన్నారు. అలాగే సోమవారం నుంచి 11వ తేదీ వరకు ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను వినియోగించుకునే అవకాశముందన్నారు. జిల్లాలో గత రెండు ఎన్నికల్లో 85 శాతం వరకు ఓటింగ్ జరగ్గా ఈసారి మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే ఈవీఎంలు ర్యాండమైజేషన్ పూర్తిచేసి ఆయా నియోజకవర్గాలకు తరలించడంతోపాటు కమిషనింగ్ కూడా పూర్తి చేశామన్నారు. ఇంటింటికీ ఓటరు స్లిప్పుల పంపిణీ సుమారు 80 శాతం పూర్తయ్యిందని చెప్పారు.

520 వాహనాల వినియోగం

ఈవీఎంలు, సిబ్బంది తరలింపునకు అవసరమైన రవాణాకు ప్రణాళిక సిద్ధం చేశామని దీనికోసం సుమారు 520 ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలను వినియోగిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల నిబంధనల విషయంలో కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడేది లేదని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఇప్పటివరకు 14 ఎఫ్ఐఆర్‌లు నేరుగా నమోదు చేసి అక్రమంగా తరలిస్తున్న రూ.2.10 కోట్ల నగదు, మద్యం సీజ్ చేసినట్లు వివరించారు. ఎస్పీ అజిత మాట్లాడుతూ ఎన్నికల్లో ఎక్కడా హింసాత్మక సంఘటనలు జరగకుండా కృషి చేస్తున్నామన్నారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామని, ఇప్పటికే సీఆర్‌పీఎఫ్, జిల్లా పోలీస్, నాగాలాండ్ స్పోర్ట్స్ జిల్లాలో ఎన్నికల భద్రత కోసం పని చేస్తున్నాయని చెప్పారు. ఎన్నికల సమయంలో ఎవరైనా ఉద్దేశపూర్వకంగా అలజడలు, అల్లర్లు, ఘర్షణలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ అజిత హెచ్చరించారు.

బీసీలకు పెద్దపీట



ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

పాలకోడేరు: సీఎం జగన్ పాలనలో బీసీలకు పెద్దపీట వేశారని, అన్నివర్గాలకు సముచిత స్థానం కల్పించారని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అన్నారు. మండలంలోని వేంద్ర అగ్రహారం, రామచంద్రపురం గ్రామాల్లో ఆదివారం ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ సోదరుడు పెన్మెత్స గోపాలకృష్ణంరాజు, ఎంపీపీ భూపతిరాజు చంటిరాజుతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సీఎం జగన్ పాలనలో ప్రజలకు జరిగిన మేలును వివరించారు. అన్నివర్గాలకు సమన్యాయం చేశారని, ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ప్రాధాన్యమిచ్చారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు బీసీలకు చేసిందిఏమీ లేదని జగన్ ప్రభుత్వంలోనే బీసీలు అభివృద్ధి సాధించారన్నారు. రానున్న ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి జగన్‌కు మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. విస్సాకోడేరు సర్పంచ్‌లు బొల్లా శ్రీనివాస్, చింతపల్లి వెంకటనారాయణ, గొరగనమూడి మాజీ సర్పంచ్ చెల్లబోయిన పాపారావు, బొక్కా రాంబాబు, భూపతిరాజు వంశీకృష్ణంరాజు, పాలా శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

రూ.200 కోట్లతో మౌలిక వసతుల కల్పన

ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు



గొల్లలకోడేరులో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు

పాలకోడేరు: ఉండి నియోజకవర్గంలో గత 59 నెలల్లో రూ.200 కోట్లకు పైగా నిధులతో మౌలిక వసతులు కల్పించినట్టు వైఎస్సార్‌సీపీ ఉండి అసెంబ్లీ అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. మండలంలోని గొల్లలకోడేరు సంజన అపార్ట్‌మెంట్స్ ప్రాంతంలో ఆదివారం ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ ప్రతి ఇంటికీ నవరత్నాల పేరుతో పేదలకు మేలు చేశారన్నారు. సీఎం జగన్ పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందన్నారు. అపార్టుమెంట్ వాసులకు మంచినీటి సౌకర్యార్థం వాటర్ ట్యాంకు నిర్మాణం చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో ఉండి ఏఎంసీ వైస్ ఛైర్మన్ చేకూరి నరేంద్ర రాజు, గాదె రాజు వీరభద్ర రాజు, అప్పలరాజు, జీవీఎల్ నర్సింహరావు, నేతల సాల్మన్, అవుడు శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శివరామరాజు కార్యాలయం వద్ద నిరసన

- తీసుకున్న అప్పు చెల్లించాలంటూ పొత్తూరి అర్ధనగ్న నిరసన
- ఓటమి భయంతో రఘురామకృష్ణరాజు ఎత్తుగడలంటూ శివ వర్గం విమర్శలు



నిరసన వ్యక్తం చేస్తున్న పొత్తూరి వెంకటేశ్వరరాజు

భీమవరం: ఎన్నికల వేళ ఉండి నియోజకవర్గంలో రాజకీయం రసవత్తరంగా మారుతోంది. మూడు ముక్కలుగా మారిన తెలుగుదేశం పార్టీలో ఒకరిపై ఒకరు ఆధిపత్యం చెలాయించడానికి ఎత్తులకు పై ఎత్తులు వేస్తున్నారు. దీనిలో భాగంగానే మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఎన్నికల్లో ఉండి నియోజకవర్గం నుంచి ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వేటుకూరి శివరామరాజుకు చెందిన భీమవరంలోని కార్యాలయం వద్ద తన సొమ్ములు చెల్లించాలంటూ టీడీపీ సీనియర్ నాయకుడు పొత్తూరి వెంకటేశ్వరరాజు నిరసన దీక్ష చేపట్టారు. రెబల్ అభ్యర్థిగా శివరామరాజు బరిలో నిలవడంతో ఆయన్ని పోటీ నుంచి విరమింపజేయడానికి టీడీపీ అభ్యర్థి రఘురామకృష్ణరాజు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో శివరామరాజు పోటీలో ఉంటే తనకు గట్టి దెబ్బ తగులుతుందని భావించిన రఘురామకృష్ణరాజు శివరామరాజును వ్యక్తిగతంగా దెబ్బతీయాలనే ప్రయత్నాలు ప్రారంభించినట్టు తెలుస్తోంది. అందులో భాగంగానే వెంకటేశ్వరరాజుకు శివరామరాజు రూ.50 లక్షలకు పైగా బాకీ ఉండడంతో ఇటీవల సొమ్ములు చెల్లించాలని అడిగారు. ఎన్నికలు ముగిసిన తర్వాత సర్దుబాటు చేస్తానని ఆయన చెప్పగా వెనుదిరిగారు. అయితే శివరామరాజును రాజకీయంగా దెబ్బతీయడానికి పొత్తూరిని రఘురామకృష్ణరాజు రెచ్చగొట్టి నిరసన కార్యక్రమం చేపట్టేలా ప్రోత్సహించారని తెలుస్తోంది. ఆదివారం ఉదయం శివరామరాజు కార్యాలయంలో లేని సమయంలో పొత్తూరి అర్ధ నగ్నంగా నిరసన తెలిపారు. తనకు డబ్బు చెల్లించేవరకు కదిలేది లేదంటూ హంగామా చేశారు. విషయం పోలీసుల దృష్టికి వెళ్లడంతో డబ్బుల విషయం కోర్టులో చూసుకోవాలని, ఇలా అల్లరి చేయడం మంచిది కాదని చెప్పి అక్కడి నుంచి పంపించివేశారు. ఈ విషయంలో రఘురామకృష్ణరాజుదే ప్రధాన పాత్ర అని, ఓటమి భయంతోనే ఆయన శివను అల్లరి చేయిస్తున్నాడని శివ వర్గ నేతలు మండిపడుతున్నారు.

క్లుప్తంగా

బాస్కెట్‌బాల్ జాతీయ పోటీలకు ఏలూరు క్రీడాకారులు



జాతీయ బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటున్న ఏలూరు క్రీడాకారులు

ఏలూరు రూరల్ : జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఏలూరుకు చెందిన నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కోశాధికారి కె.మురళీకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్‌లో ఈ నెల 8 నుంచి 15 వరకు 74వ జాతీయ స్థాయి జూనియర్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర బాలికల జట్టుకు ఏలూరుకు చెందిన పి.నాగవినయశ్రీ, డి.పావనిప్రియ, పి.జయశ్రీ ఎంపికయ్యారు. బాలుర జట్టుకు ఏలూరు క్రీడాకారుడు ఈశ్వర్‌తేజ ఎంపికయ్యాడని వెల్లడించారు. వీరు ఇటీవల నూజివీడులో జరిగిన 9వ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటి జాతీయ పోటీలకు ఎంపికయ్యారన్నారు. క్రీడాకారులను అసోసియేషన్ అధ్యక్షుడు కె.కృష్ణారెడ్డి, కార్యదర్శి గవ్వ శ్రీనివాస్ అభినందించారు.

లారీని ఢీకొన్న ట్రావెల్ బస్సు

తణుకు: దువ్వ పరిధిలోని హైవేపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీని ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. హైదరాబాదు నుంచి యానం వెళుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు సూర్యారావుపాలెం రోడ్డు నుంచి హైవేపైకి ధాన్యం లోడుతో వచ్చిన లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. ఈ ప్రమాదంలో బస్సులోని ప్రయాణికులకు గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

వైఎస్సార్ సీపీలోకి వలసలు

మొగల్తూరు: రాబోయే రోజుల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని నరసాపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు సూచించారు. మొగల్తూరు గ్రామంలోని పెదపల్లవపాలెంలో ప్రసాదరాజు ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించగా, అదే ప్రాంతానికి చెందిన వాటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆయన కుటుంబ సభ్యులు, మహిళలు, బంధువులు సుమారు 50 మంది టీడీపీ సానుభూతిపరులు ప్రసాదరాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరగా, వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు తిరుమాని బాపూజీ, నాయకులు కర్రి ఏసుబాబు, గుబ్బల నారాయణ మూర్తి, కుక్కల కృష్ణమోహన్, మోకా శ్రీను, వాటాల సూర్యారావు, వరాస్వామి, సాంబమూర్తి, వాటాల వెంకటేశ్వరరావు, రాముడు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి శెట్టిబలిజల మద్దతు

పెనుగొండ: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీకి బీసీల మద్దతు నానాటికీ పెరుగుతోందని, ముఖ్యంగా ఆచంట నియోజకవర్గంలో శెట్టిబలిజలు అత్యధిక స్థాయిలో మద్దతు ఇస్తున్నారని వైఎస్సార్ సీపీ ఆచంట ఎమ్మెల్యే అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆదివారం తూర్పుపాలెంలో పోడూరు మండలం కవిటం, పెంకుళ్లపాలెంకు చెందిన 100 శెట్టిబలిజ కుటుంబాలు శ్రీరంగనాథరాజు సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరాయి. నిత్యం నియోజకవర్గంలో ప్రతి గ్రామం నుంచి బీసీ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో చేరుతున్నారన్నారు. సీఎం జగన్ అందించిన సంక్షేమానికి బీసీలు ఆకర్షితులవుతున్నారన్నారు. గత ప్రభుత్వంలా హామీలను మరచిపోకుండా అమలు చేస్తున్నారన్నారు. పార్టీలో చేరి వారిలో బోరాబత్తుల వెంకటేష్, కుడిపూడి శ్రీను, కుడిపూడి వెంకటేశ్వర్లు, బోరాబత్తుల సూర్యకృష్ణ, జోగి వెంకట రామయ్య, కుడిపూడి జగదీష్, గూడూరి చిన్న పండు, బొంతు శీను, రామానంద సుధీర్, కొప్పవరపు తేజ, చింతపల్లి చంటిబాబు, గుబ్బల రాధాకృష్ణ, కాళ్ల సూర్యచంద్రరావు, సాయి, వీరవల్లి కృష్ణవర్దన్, కొప్పిశెట్టి రవి, వీరవల్లి నాని, మామిడి శెట్టి సాయికుమార్, కుక్కల దుర్గారావు, కుక్కల రాము, మామిడిశెట్టి శ్రీను, మామిడిశెట్టి ఏసుబాబు, కుక్కల విష్ణు, మామిడిశెట్టి రాము, బొంతు సూర్యనారాయణ, దెయ్యాల సాయిప్రసాద్, కుక్కల సూర్య, చింతపల్లి వెంకటేష్, కోప్పా శ్రీను, కోలా సాయి ప్రసాద్ కుటుంబాలు ఉన్నాయి. కార్యక్రమంలో కవిటం వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



సిద్ధాంతంలో శ్రీరంగనాథరాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన శెట్టి బలిజ నాయకుడు సత్యనారాయణ



తూర్పుపాలెంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ షర్మిల సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన ఆచంట రావిగుంట శెట్టిబలిజలు

షర్మిల సమక్షంలో..

ఆచంట రావిగుంటకు చెందిన శెట్టిబలిజ, గౌడ సంఘాల నాయకులు ఆదివారం తూర్పుపాలెంలో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, ఆచంట ఎమ్మెల్యే అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు తనయుడు నరేష్ రాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. చేరిన వారిలో కడలి ధనలక్ష్మి, వేండ్ర సూర్యనారాయణ, వేండ్ర ఏసుబాబు, పితాని శ్రీనివాసు, చింతపల్లి త్రిమూర్తులు, కేతా సుశీల, కడలి ధనలక్ష్మి, కేతా సీతారత్నం, వేండ్ర సత్యవతి, కట్టా శ్రీనివాసరావు, తుంటా నాగేంద్రబాబు, కొయ్యేటి సాయి, కొయ్యేటి సుబ్రహ్మణ్యం ఉన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు పెచ్చెట్టి సత్యనారాయణ, మండల బీసీ సెల్ కన్వీనరు కడలి నారాయణ ప్రసాద్, కోట వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ మట్టా ఆనంద్‌కుమార్, నంబూరి రాజా, కేతా నాగేశ్వరరావు, కేతా శాంతి కుమారి పాల్గొన్నారు.

సిద్ధాంతంలో..

సిద్ధాంతం శెట్టిబలిజ సంఘ నాయకుడు కుడిపూడి సత్యనారాయణ ఆదివారం ఆచంట ఎమ్మెల్యే అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ పుతీనీడి వెంకటేశ్వరరావు, పార్టీ అధ్యక్షుడు జుత్తిగ దామోదరం, కుడిపూడి సూరిపండు, కుడిపూడి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

విస్సాకోడేరులో టీడీపీ నుంచి

భారీగా చేరికలు



విస్సాకోడేరులో టీడీపీ, జనసేన మహిళా కార్యకర్తలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఉండి ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు, నరసాపురం ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాల

పాలకోడేరు: ఎన్నికలు దగ్గర పడేకొద్దీ వైఎస్సార్ సీపీకి జనాదరణ పెరుగుతోంది. ముఖ్యంగా తెలుగుదేశం, జనసేన పార్టీల నుంచి కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. వీరిలో ప్రధానంగా మహిళా కార్యకర్తలు ముందు వరసలో ఉన్నారు. ఆదివారం విస్సాకోడేరులో సర్పంచ్ బొల్లా శ్రీనువాసు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు, నరసాపురం పార్లమెంట్ అభ్యర్థిని గూడూరి ఉమాబాల, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి సమక్షంలో 200 మంది టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నరసాపురం పార్లమెంట్ అభ్యర్థిని గూడూరి ఉమాబాల మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎంపీగా ఉన్న వ్యక్తి ఇప్పుడు ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారని, గెలిచిన తర్వాత ఎక్కడ ఉంటారో తెలియదన్నారు. ఏ పార్టీ తరపున ఎన్నికల్లో గెలిచారో అదే పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన చరిత్ర ఆయనదని పరోక్షంగా రఘురామకృష్ణంరాజును ఉద్దేశించి విమర్శించారు. ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న పీవీఎల్ నర్సింహరాజు ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తున్నారన్నారు. ఎన్నికల్లో పీవీఎల్‌ను గెలిపించాలని ఉమాబాల కోరారు. బీసీ కులాలకు నరసాపురం పార్లమెంట్ సీటు కేటాయించి సీఎం వైఎస్ జగన్ ఎంతో గౌరవం కల్పించారని, మీ ఆడబడుచుగా భావించి తనను గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు మాట్లాడుతూ తాను ఎమ్మెల్యే కాకపోయినా ఐదేళ్లుగా నియోజవర్గంలోని 72 గ్రామాల్లో కూడా రోడ్లు, డ్రెయిన్లు, వాటర్ వర్క్స్ సచివాలయాల నిర్మాణాలు పూర్తి చేయడానికి సహకారం అందించానన్నారు. జగనన్న సంక్షేమ పథకాలు మళ్లీ కొనసాగాలంటే రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో బీసీలకు పెద్దపీట వేశారన్నారు. సర్పంచ్ బొల్లా శ్రీనివాస్, ఎంపీపీ భూపతి చంటిరాజు, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షులు భూపతిరాజు వంశీకృష్ణంరాజు, వైస్ ఎంపీపీ ఆదాడ లక్ష్మీ తులసి, పిన్నమరాజు సహదేవ రాజు, పిన్నంరాజు శ్రీనివాసరాజు, పృధ్విరాజు, చేబోలు బాలాజీ డాక్టర్ స్వర్ణలత, గెడ్డం జోషి, ఆరేపల్లి శ్రీనివాస్, గంగిరాజు వీరవెంకట సత్యనారాయణ, సూరగాని తాతారావు, ఎంపీటీసీ బొల్లం గాంధీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీలో చేరిన మహిళలు

మూగజీవాల దాహార్తి తీర్చేందుకు కృషి

పాలకొల్లు సెంట్రల్: వేసవిలో మూగ జీవాల దాహార్తి తీర్చేందుకు పలు చోట్ల నీటి తొట్టెలు ఏర్పాటు చేస్తున్నట్లు రామ్‌శ్లోక్ ఫౌండేషన్ సభ్యులు మంతెన గోపాలం చెప్పారు. ఆదివారం స్థానిక వెటర్నరీ ఆసుపత్రిలో రామ్‌శ్లోక్ ఫౌండేషన్, నెస్ట్ కన్సర్‌వేషన్ సొసైటీ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నీటి తొట్టెలు పంపిణీ చేశారు. గోపాలం మాట్లాడుతూ పట్టణంలో రోడ్లపై తిరిగే గోవులు, కుక్కలు, పక్షులు వంటి మూగ జీవాలకు వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. రోడ్లపై మూగజీవాల కొరకు నీటిని అందించాలనుకునే వ్యక్తులకు వీటిని పంపిణీ చేస్తామన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ పాలకొల్లు, మాంటిస్సోరిస్ స్కూల్ లజపతిరాయ్‌పేట సంస్థలు ఒకొక్కరు రూ. 10 వేలు చొప్పున 100 తొట్టెలను అందజేశారన్నారు.



నీటి తొట్టెలను అందజేస్తున్న రామ్‌శ్లోక్, నెస్ట్ ఆర్గనైజేషన్ సభ్యులు

నెస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలో పలు కూడళ్లలో నీటి తొట్టెలను ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే ఇంటి వద్ద ప్రహరీలపై పక్షుల కొరకు నీటిని ఏర్పాటు చేయడానికి కూడా చిన్న కుండీలను ఏర్పాటుచేస్తున్నామన్నారు. నెస్ట్ ఆర్గనైజేషన్ సభ్యులు మనీష్, రామ్‌శ్లోక్ పౌండేషన్ సభ్యులు లేళ్ల వాసు, నంబూరి స్వామి, తాడి శ్రీనివాసు, చేగొండి ప్రభాకర్, గోటేటి రాజా, సలాది వేణు, గనిరాజు పాల్గొన్నారు.

టీడీపీ చింతలపూడి అభ్యర్థి సొంగాను ప్రాసిక్యూట్ చేయాలి

రిటైర్డ్ ఎంఈఓ ఎస్.ధర్మదాసు



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): చింతలపూడి అసెంబ్లీ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి సొంగా రోషన్ కుమార్‌ను ప్రాసిక్యూట్ చేయాలని రిటైర్డ్ మండల విద్యాశాఖాధికారి సేవ ధర్మదాసు డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ఎన్‌ఆర్‌గా ఉంటూ, తన ఓటును ఫారమ్ 6ఏ ద్వారా నమోదు చేయకుండా లోకల్ ఓటర్‌గా ఎపిక్ నంబర్ డబ్ల్యూఎక్స్‌డబ్ల్యూ 1469121గా నమోదు చేయించుకోవడం ఎన్నికల నియమావళికి విరుద్ధమే కాకుండా ప్రజాప్రాతినిధ్య చట్టం సెక్షన్ 8ఏ, 123 (2) ప్రకారం అనర్హత వర్తిస్తుందన్నారు. అంతేకాకుండా, ఏప్రిల్ 22న ఆయన దాఖలు చేసిన అఫిడవిట్‌లో అమెరికాలోని వెస్ట్ వర్జీనియాలో గల బ్యాంక్ ఖాతాలను, ఇన్సూరెన్స్ విషయాలను కప్పిపుచ్చి, దానిపై తాను లేవనెత్తిన అభ్యంతరంతో ఏప్రిల్ 25న మరో నామినేషన్, అఫిడవిట్ దాఖలు చేసి తనకు అమెరికాలో వెస్ట్ వర్జీనియాలో గల బ్యాంక్ ఖాతాలను, ఇన్సూరెన్స్ విషయాలను చేర్చి తన డొల్లతనాన్ని తానే బయటపెట్టుకున్నారన్నారు. ఇది పూర్తిగా ఎన్నికల ప్రవర్తన నియమావళికి విరుద్ధమని స్పష్టం చేశారు. అలాగే రిప్రజెంటేషన్ ఆఫ్ పీపుల్స్ యాక్ట్, ఐపీసీ సెక్షన్ల కింద ప్రాసిక్యూషన్ చేయాలని కోరుతూ రాష్ట్రపతి నుంచి కలెక్టర్ వరకు అందరికీ ఫిర్యాదులు చేశామన్నారు. ఇటీవల చింతలపూడిలో దళితులతో నిర్వహించిన సమావేశంలో అగ్రవర్ణాలకు చెందిన వారిని వేదికపై కూర్చోపెట్టి దళితులను వేదిక కింద కూర్చోపెట్టి రోషన్ కుమార్ దళితులను అవమానించారని, అలాగే ఎన్నికల ప్రచారంలో భాగంగా చెప్పులు ధరించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేయడం అంబేద్కర్‌ను అవమానించడమేనన్నారు. రోషన్ కుమార్ ఎన్నికల్లో గెలిచినా తరువాత అతనిపై అనర్హతకు గురవుతారని, చింతలపూడి నియోజకవర్గ ప్రజలు విజ్ఞతతో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.



పరీక్షా కేంద్రం వద్ద క్యూలైన్‌లో విద్యార్థులు



పరీక్షా కేంద్రం వద్ద మండుటెండలో విద్యార్థుల పడిగాపులు

ప్రశాంతంగా నీట్ పరీక్ష

- 952 మంది అభ్యర్థులకు 929 మంది హాజరు
- భీమవరం భారతీయ విద్యాభవన్స్‌లో పరీక్ష కేంద్రం



భీమవరంలో భారతీయ విద్యాభవన్స్ పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థుల హాల్‌టికెట్లు పరిశీలిస్తున్న దృశ్యం



జడలు ముడి వేసుకుంటున్న విద్యార్థినులు

భీమవరం: వైద్య విద్య కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) భీమవరంలో ఆదివారం ప్రశాంతంగా జరిగింది. పట్టణంలోని భారతీయ విద్యాభవన్స్ సంస్థలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 952 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 929 మంది హాజరయ్యారని సిటీ కో-ఆర్డినేటర్ ఎల్‌వీ రమాదేవి చెప్పారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని తెలిపారు.

అవస్థలు పడ్డ అభ్యర్థినులు

నీట్ పరీక్ష రాసేందుకు కేంద్రానికి వచ్చిన అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు పలు అవస్థలు పడ్డారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే పరీక్షకు, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల లోపే కేంద్రంలోకి అభ్యర్థులను అనుమతిస్తామని అధికారులు ప్రకటించడంతో అభ్యర్థులు, తల్లిదండ్రులతో కలిసి ఉదయం 9 గంటలకే పెద్ద సంఖ్యలో పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. నడిరోడ్డుపై క్యూలైన్లు ఏర్పాటు చేయడం, కేవలం ముగ్గురిని మాత్రమే విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు నియమించడంతో తీవ్రమైన ఎండలో అభ్యర్థులు క్యూలో నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు ఫార్మల్ దుస్తులు మాత్రమే ధరించి రావాలని, ఆభరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు వెంట తీసుకురాకూడదని నిబంధనలు విధించడంతో అభ్యర్థినులు మండుటెండలోనే జుట్టు ముడివేసుకోవడం, చెవిదిద్దులు, చైన్స్, కాళ్ల పట్టీలు తొలగించి బంధువులకు అప్పగించాల్సి ఉంది.



కాళ్ల పట్టీలను తొలగిస్తున్న విద్యార్థిని

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఆదివారం ఇద్దరు భక్తులు రూ.2,02,121 విరాళంగా అందజేశారు. కృష్ణాజిల్లా కలిదిండికి చెందిన పచ్చిగోళ్ల లలితాప్రసాద్ రూ.1,02,121, రాజమండ్రికి చెందిన కవికొండల అప్పల నరసమ్మ రూ.1,00,000 ఆలయ కార్యాలయంలో జమచేశారు. దాతలకు విరాళం బాండ్ పత్రాలను అందించారు.

మద్యం పట్టివేత

యలమంచిలి: కొంతేరు గ్రామంలో ఆదివారం రాత్రి మద్యం సీసాలు తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నట్లు ఎస్సై కాకి శివ నారాయణ చెప్పారు. అతని వద్ద ఎనిమిది క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మద్యం సీసాలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

లారీ ఢీకొని ఆటో డ్రైవర్ మృతి

నూజివీడు: ఆటోను లారీ ఢీకొన్న సంఘటనలో ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. హనుమంతులగూడెంకు చెందిన ఆటో డ్రైవర్ కర్నికోటి రాంబాబు (35) ఆదివారం ఆటో నడుపుకుంటూ నూజివీడు వస్తుండగా విస్సన్నపేట వైపు వెళ్తున్న లారీ వేగంగా వస్తూ ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జు కాగా పాటు ఆటో డ్రైవర్ లారీ చక్రాల కింద పడటంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ప్రమాదం సంభవించినప్పుడు ఆటోలో ప్రయాణికులు ఎవరూ లేరు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు.



ఘటనా స్థలంలో రాంబాబు మృతదేహం

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి: భక్తుల పాలిట కల్పతరువుగా, కోరిన కోర్కెలు నెరవేర్చే తల్లిగా రాట్నాలకుంటలో వెలిసిన శ్రీరాట్నాలమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రీతికరమైన రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి, పూజలు చేశారు. అమ్మవారికి కామవరపుకోటకు చెందిన పావులూరి రఘురాం, ప్రశాంతికుమారి దంపతులు రూ.5 వేల విలువ చేసే బంగారు సూత్రాలను బహూకరించారు. ఈ వారం పూజా టికెట్ల విక్రయం ద్వారా రూ.34,065, విరాళాల రూపంలో రూ.6,340 లడ్డూ ప్రసాదం విక్రయాల ద్వారా రూ.10,590, ఫొటోల అమ్మకం ద్వారా రూ.2,885 వెరశి మొత్తం రూ.53,880 ఆదాయం లభించిందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.సతీష్‌కుమార్ చెప్పారు.

గోదావరిలో స్నానానికి దిగి ట్యాక్సీ డ్రైవర్ గల్లంతు

పోలవరం రూరల్: గోదావరి నదిలో స్నానానికి దిగిన ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. హెచ్‌సీ శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జంగారెడ్డిగూడెంకు చెందిన 42 సంవత్సరాల ట్యాక్సీ డ్రైవర్ ఆదివారం ఉదయం కొందరితో కలిసి పోలవరంలోని ఆంజనేయస్వామి గుడికి వెళ్లాడు. అక్కడ గోదావరి రేవులో స్నానానికి దిగగా ప్రమాదవశాత్తు లోతుగా ఉన్న ప్రాంతంలో గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టినట్లు హెచ్‌సీ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని చెప్పారు.

గోడ కూలి భవన నిర్మాణ కార్మికుడి మృతి

పోలవరం రూరల్: శిథిలావస్థలో ఉన్న ఇంటి గోడ కూలి భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందినట్లు స్టేషన్ హెచ్‌సీ కె.శ్రీనివాస్ చెప్పారు. పోలవరం గ్రామానికి చెందిన పోలవరపు వీరభద్రం (46) భవన నిర్మాణ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం తన ఇంటి సమీపంలో శిథిలావస్థలో ఉన్న ఇంటి గోడ వద్ద ఉండగా ఒక్కసారి గోడ కూలి మీద పడటంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలవరం వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

క్లుప్తంగా

ముస్లింలంతా సీఎం జగన్ వైపే



ఎన్నికల ప్రచారంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, ముస్లింలు

తణుకు అర్బన్: ముస్లింలంతా వైఎస్సార్ సీపీకి అండగా నిలవనున్నారని రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ అన్నారు. ఆదివారం తణుకు 1, 2, 3 వార్డులోని ముస్లింల ఇళ్లకు వెళ్లి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం వర్గాలకు ఎంతో మంచి చేస్తున్నారని ఆయన బలపరచిన తణుకు అసెంబ్లీ అభ్యర్థి మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును, ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలను ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో షేక్ బాజీ, షేక్ సలీం, షేక్ అబ్దుల్ ఖాదర్ జిలానీ, షేక్ ఫహీమా, అన్సారీ, అన్వర్, మక్బూల్, వార్డు నాయకులు ఏసుబాబు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో విశాల్ ఎన్నికల ప్రచారం

పెంటపాడు: మండలంలోని ఆదివారం రాత్రి యువనేత కొట్టు విశాల్ పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముదునూరు, ఆకుతీగపాడు, కె. పెంటపాడు, గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు లబ్ధిని వివరించారు. ఎమ్మెల్యేగా కొట్టు సత్యనారాయణకు, ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, సర్పంచ్‌లు గొర్రెల కోటేశ్వరరావు, భావన ధాన్యలక్ష్మి, దాసం వెంకటేశ్వర్లు, వైఎస్ ఎంపీపీ కొణతాల వెంకట్రావు, పార్టీ నాయకులు గుండుమోగుల సాంబయ్య, గోకా వెంకటేశ్వరరావు, బొమ్మినాయుడు, మిరియాల శేషు, ఆకుల ధనశేఖర్, నిమ్మల పెదకాపు, ముదునూరు సొసైటీ అధ్యక్షులు బూరాడ శ్రీను పాల్గొన్నారు.

దివ్యాంగులు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్క దివ్యాంగుడు తమ విలువైన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని తాడేపల్లిగూడెం దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేంద్రరెడ్డి పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ ఓటుకు ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా, బలాన్ని చూపిద్దామని దివ్యాంగులకు పిలుపునిచ్చారు.

చర్చిల అభివృద్ధికి సహకరిస్తా



ఈడూరు చర్చిలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



గోటేరులో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న మంత్రి కారుమూరి

ప్రార్థనా మందిరాలను సందర్శించిన మంత్రి కారుమూరి

అత్తిలి: ఎన్నికల అనంతరం క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు చెప్పారు. ఆదివారం అత్తిలి మండలం మంచిలి, కంచుమర్రు, ఈడూరు, స్కిన్నెరపురం, కొమ్మర, ఈడూరు గ్రామాల్లో గల ప్రార్థనా మందిరాలను మంత్రి కారుమూరి సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాస్టర్లకు ప్రతి నెలా రూ. 5 వేలు గౌరవ వేతనం అందజేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో చర్చిల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలను అందజేస్తానన్నారు. మీకు మంచి చేసిన వాళ్లను గుర్తుంచుకుని మీవంతు సహాయ సహకారాన్ని ఇవ్వాలని కోరారు. క్రైస్తవ సంఘాల అభ్యున్నతికి వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, సర్పంచ్ మంతెన రామలింగరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు పెన్మెత్స వెంకటపతిరాజు, తేలి సుందరరావు, సబ్బితి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మంచి చేసిన నాయకులకు అండగా నిలవాలి

తణుకు టౌన్: రాష్ట్రంలో పేదలందరికీ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరో సారి గెలిపించాలని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కోరారు. ఆదివారం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని వివిధ చర్చిల్లో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్నారు. వేల్పూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు దుర్గా ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, ఎంపీటీసీ సభ్యురాలు చంద్రు శ్యామల, రెడ్డి సత్తిరావు, సొసైటీ డైరెక్టర్ కనక మహాలక్ష్మి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైస్తవులకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుంది

ఇరగవరం: క్రైస్తవులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. ఆదివారం ఇరగవరం మండలంలోని గోటేరు, రాపాక, ఏలేటిపాడు, పేకేరు, గ్రామంలోని చర్చిలో క్రైస్తవ ఆరాధనల్లో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కారుమూరి అల్లుడు దిలీప్ కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, సీనియర్ నాయకులు వెలగల సాయిబాబా రెడ్డి, సత్తి సత్తిబాబు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొట్ల సురేష్, ఆయా గ్రామాల్లోని పాస్టర్లు, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యానుకి ఓటేస్తేనే మళ్లీ పథకాలు

గ్రామాల్లో అభ్యర్థులకు మద్దతుగా ప్రచారాలు

తణుకు టౌన్: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఆదివారం వేల్పూరు గ్రామంలో ఇంటింటి తిరిగి ప్రచారం చేశారు. తణుకు ఎమ్మెల్యే అభ్యర్థిగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు నున్న దుర్గా ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, వైస్ ఎంపీపీ ఐశెట్టి శేషుకుమారి, ఎంపీటీసీ సభ్యులు చంద్రు శ్యామల, తాడిపర్తి సుజాత, కోఆప్షన్ సభ్యుడు కే జస్పాల్, ఏఎంసీ డైరెక్టర్ బండి పార్వతి, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే తేతలి కూడా గ్రామ కమిటీ అధ్యక్షుడు కోట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షుడు సరెళ్ల వీరతాత, సొసైటీ అధ్యక్షుడు పీ సతీష్ రాజు, కోట స్వామీజీ, దారం శ్రీను, భూపతిరాజు రామకృష్ణంరాజు, వలవల కిషోర్, భీమచంద్రరావు, దాసరి అనంద్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని కాంక్షించే కొట్టును గెలిపించండి

తాడేపల్లిగూడెం అర్బన్ : ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని కొట్టు తనయుడు బాల రాజేష్, కుమార్తె కాంచనలు తెలిపారు. ఆదివారం కాంచన్ 14వ వార్డులోను, కొట్టు బాలరాజేష్ 32వార్డులోను ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తాడేపల్లిగూడెం నియోజవకర్గంలో రెండు సార్లు ఎమ్మెల్యేగా నిలిచిన కొట్టు సత్యనారాయణను ఆశీర్వదించాలని కోరారు. వెంట గొర్రెల లక్ష్మీ నర్సమ్మ, గొర్రెల శ్రీనివాస్, వట్టి బుజ్జి, గురజాడ బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.



32వవార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న కొట్టు బాలరాజేష్



తణుకు మండలం తేతలిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

అవ్వాతాతలపై చంద్రబాబు పగబట్టాడు

తాడేపల్లిగూడెం (టీఓసీ): అవ్వాతాతలపై చంద్రబాబు పగబట్టి వారి పట్ల యముడిలా ప్రవర్తిస్తున్నాడని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు విమర్శించారు.ఈ సందర్భంగా మంగరాజు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి చంద్రబాబు దుష్టగ్రహంలా దాపురించాడని, పేదలు, వృద్ధులు సుఖంగా ఉంటే చూడలేకపోతున్నాడని విమర్శించారు. గత ఐదేళ్లుగా వలంటీర్ వ్యవస్థ ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి గుమ్మంలోకే ఇచ్చిన పింఛన్ పంపిణీ విధానాన్ని చంద్రబాబు జీర్ణించుకోలేక పోయాడని, పరిపాలన ఎన్నికల అధికారి చేతుల్లోకి వెళ్లిన వెంటనే తన కుట్ర రాజకీయాన్ని బయటకుతీశాడని దుయ్యబట్టారు.అవ్వాతాతలపై చంద్రబాబు చేస్తున్న కుట్ర రాజకీయాలను ప్రజలంతా గమనిస్తున్నారని, ఇంతకింత అనుభవించే రోజు తొందరలోనే ఉందని గుర్తుచేశారు. ఈ సమావేశంలో నాయకులు వీరవల్లి సునీల్, గెడ్డం అచ్చిబాబు, సుంకర ఎలీషా పాల్గొన్నారు.

తెలుగు క్యాలెండర్ ఆవిష్కరించిన మంత్రి కారుమూరి



తణుకులో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు: త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి, హిందూ జ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు క్యాలెండర్‌ను ఆదివారం రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. తణుకులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ మేరకు క్యాలెండర్‌ను ఆవిష్కరించి అభినందించారు. కార్యక్రమంలో సమితి తణుకు, భీమవరం సభ్యులు ఉదయ్‌కుమార్, జి.నాగేశ్వరరావు, లోకేష్, వాసుదేవరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



తణుకులో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆటో డ్రైవర్లు

తణుకు అర్బన్: స్వయం ఉపాధితో జీవనోపాధి మాకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారంటూ తణుకులో ఆటో డ్రైవర్లు సంతోషం వ్యక్తం చేశారు. టీడీపీ తమ మ్యానిఫెస్టోలో మహిళలకు ఉచిత బస్సు ప్రవేశపెట్టిన వెంటనే ఆటో డ్రైవర్స్ యూనియన్‌ల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టడమే కాకుండా తమ పొట్టకొట్టే ఉచిత బస్సు పథకం వైఎస్సార్ సీపీ మ్యానిఫెస్టోలో పెట్టవద్దంటూ జగనన్నను వేడుకున్నామన్నారు. మా బాధ అర్థం చేసుకున్న జగనన్న ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణాన్ని పరిగణలోకి తీసుకోలేదని మా జీవితాంతం ఆయనకు రుణపడి ఉంటామంటూ తణుకులో ఆటోడ్రైవర్లు సీఎం జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తణుకు సజ్జాపురంలో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో భారతమాత ఆటో యూనియన్ కార్యదర్శి కంచుమర్తి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ మాగోడు విన్న జగనన్నకు ఆటోడ్రైవర్స్ కుటుంబాలన్నీ అండగా నిలబడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బొదిరెడ్డి శ్రీనివాస్, నాగిరెడ్డి శ్రీనివాస్, గొల్ల బెనర్జి, కె.కుమార్, అత్తిలి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రం సుభిక్షం



జగన్నాథపురం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని జగన్నాథపురం గ్రామంలో కొట్టు సత్యనారాయణను గెలిపించాలని కోరుతూ ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంపత్ కుమార్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేశామన్నారు. కుటుంబంలో లబ్ధి చేకూరితేనే ఓటేయాలని సీఎం జగన్ కోరుతున్నారని, ఈ విషయాన్ని గుర్తించి లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ ఆయనకు బాసటగా నిలవాలన్నారు. అడ్డాల గోపీకృష్ణ, కరిపోతు పుల్లారావు, ముప్పిడి లక్ష్మణరావు, తులా మస్తాన్, పొనుకు మాటి కృష్ణ, కొయ్యే చినవెంకట్రావు, మరపట్ల గోతియ్య, ముప్పిడి మధు, ముప్పిడి రాంబాబు పాల్గొన్నారు. మాధవరం గ్రామంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు, దండగర్రలో ములగాల గంగారావు, యాతం సత్యనారాయణ, గట్టి సత్యనారాయణ, సత్తి వెంకటేశ్వరరావు, ములగాల శ్రీనివాస్, సత్తి అన్నవరం, సత్తి శివ తదితరులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ప్రశాంతంగా నీట్ పరీక్షలు



తేతలి ఏఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద నీట్ పరీక్షకు హాజరైన విద్యార్థులు

తణుకు టౌన్: దేశ వ్యాప్తంగా చేపట్టిన నీట్ పరీక్షలు ఆదివారం తణుకు పట్టణంలోని ప్రశాంతంగా జరిగాయి. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్షల నిర్వహణకు తణుకు పట్టణంలోని ఎస్‌వీఎం పాలిటెక్నిక్ కళాశాల, తేతలిలోని ఎఎస్ ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో విద్యార్థినీ, విద్యార్థులు నీట్ ప్రవేశ పరీక్షలు రాశారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

పశ్చిమకు మణిహారం..

ఫిషింగ్ హార్బర్

సుదీర్ఘ తీరప్రాంతం ఉన్న నరసాపురంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం దశాబ్దాల నాటి కల. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో మత్స్యకారుల కల నెరవేరింది. ఉమ్మడి పశ్చిమ జిల్లా అభివృద్ధికే ఇది గీటురాయి కానుంది. జిల్లాకు మణిహారంగా మారనున్న మేజర్ ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు నరసాపురంలో ప్రారంభమయ్యాయి.

– నరసాపురం



హార్బర్ లేక పట్టణంలోని వశిష్ట గోదావరి గట్టున నిలిపి ఉంచుతున్న వేట బోట్లు

నెరవేరిన దశాబ్దాల కల

నరసాపురంలో రూ.429.43 కోట్లతో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం

పనులు చేపట్టిన విశ్వసముద్ర ఇంజినీరింగ్ సంస్థ



హార్బర్ లేకపోవడంతో కష్టంతో సముద్రంలోకి వేట బోటు పంపుతున్న మత్స్యకారులు

నరసాపురం మండలం బియ్యపుతిప్పలో మేజర్ ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి గత ఏడాది మే నెలలో ఏపీ మారిటైమ్ బోర్డు టెండర్లు పిలవగా, విశ్వసముద్ర సంస్థ పనులు దక్కించుకుంది. పర్యావరణ అనుమతులతో పాటు ఇతర సాంకేతిక అనుమతులు కూడా వచ్చేశాయి. దీంతో టెండర్లు దక్కించుకున్న విశ్వసముద్ర ఫిబ్రవరిలో ప్రాథమిక పనులు ప్రారంభించింది. 19 కిలోమీటర్ల సముద్ర తీరప్రాంతం ఉన్న నరసాపురంలో బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్ నిర్మించాలనే డిమాండ్ దశాబ్దాలుగా ఉంది. ఈ ప్రాంతంలో 5 వేల మత్స్యకార కుటుంబాలు వేటపై ఆధారపడి జీవిస్తున్నాయి.

తీరంలో అపార మత్స్యసంపద

మత్స్య సంపద, ఆక్వా ఎగుమతుల్లో ఉమ్మడి పశ్చిమ జిల్లాకు రాష్ట్రంలోనే ప్రత్యేక స్థానం ఉంది. ఇక కొత్తగా ఏర్పడ్డ డెల్టాప్రాంతంతో కూడిన పశ్చిమ నుంచి దేశ, విదేశాలకు భారీగా ఆక్వా ఎగుమతులు జరుగుతుంటాయి. రొయ్యలు, చేపల సాగు పెరగడంతో ఆక్వారంగం పుంజుకుంది. ఏటా కోట్లాది రూపాయల విదేశీ మారకద్రవ్యం ఆక్వా పుణ్యమా అని జిల్లాకు వస్తోంది. ఇటు తీరప్రాంతంలో సముద్ర మత్స్యసంపద ద్వారా కూడా భారీగా ఆదాయం సమకూరుతుంది. ఏటా నరసాపురం తీరంలో రూ.300 కోట్ల విలువచేసే మత్స్య ఎగుమతులు సాగుతాయి. కానీ హార్బర్ లాంటి మౌలిక వసతులు ఉంటే మరో 40 శాతం ఎగుమతులు పెరిగే అవకాశం ఉంది. ఆక్వా రంగంలో ఈ సవాళ్లను ఎదుర్కోవాలనే లక్ష్యంతోనే ఇప్పటికే నరసాపురంలో ఫిషరీస్ యూనివర్సిటీ ఏర్పాటు చేసింది.

600 ఎకరాల విస్తీర్ణంలో హార్బర్ నిర్మాణం ఇలా..

బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్‌ను 600 ఎకరాల విస్తీర్ణంలో రూ 429.43 కోట్ల భారీ వ్యయంతో నిర్మించాలని జగన్ ప్రభుత్వం నిర్ణయించింది. స్థల సేకరణ 2022 లోనే పూర్తిచేశారు. హార్బర్ డిజైన్‌పై కూడా ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ప్రత్యేక దృష్టి పెట్టి తయారు చేయించారు. సుమారు 300 బోట్లు నిలిచేలా ప్లాట్‌ఫామ్‌లు నిర్మించనున్నారు. సముద్రంలో లభ్యమైన సరుకును నిల్వచేసుకోవడానికి కోల్డ్ స్టోరేజ్‌లు నిర్మిస్తారు. ఏకకాలంలో 500 టన్నుల మత్స్య ఉత్పత్తులను నిల్వచేసుకోవడానికి కోల్డ్ స్టోరేజ్‌లు నిర్మిస్తున్నారు. ఇక తుపానులు వంటి ప్రకృతి విపత్తుల సమయంలో వేట సాగించే మత్స్యకారుల రక్షణకు సంబంధించి సామగ్రి హార్బర్‌లో అందుబాటులో ఉంటాయి. 216 జాతీయ రహదారి అభివృద్ధి పనులు పూర్తవ్వడంతో తీరం నుంచి రవాణా సౌలభ్యంకూడా మెరుగయ్యింది. ఇప్పుడు తీరంలో హార్బర్ నిర్మాణం సాగుతుండటంతో ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులకు మహర్దశ పట్టనుంది. హార్బర్ కమ్ కార్గో పోర్ట్ నిర్మాణం చేస్తున్నారు కాబట్టి ఇతర జిల్లాల నుంచి కూడా ఎగుమతులు జరిగే అవకాశం ఉంటుంది.

హార్బర్ విషయంలో టీడీపీ డ్రామాలు

2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ బియ్యపుతిప్ప హార్బర్ విషయంలో అనేక డ్రామాలు కొనసాగించింది. నియోజకవర్గంలో పెద్దసంఖ్యలో ఉన్న మత్స్యకారులను ఎప్పుడూ ఓటు బ్యాంకుగానే చూసిన చంద్రబాబు ప్రభుత్వం ఫిష్ ల్యాండింగ్ సెంటర్ కడుతున్నామంటూ మోసగిస్తూ వచ్చింది. 2019లో ఎన్నికలు సమీపిస్తున్న వేళ, లోకేష్‌ను తీసుకొచ్చి హడావిడిగా రూ.13 కోట్ల వ్యయంతో ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు శంకుస్థాపన చేయించారు. అయితే 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు రూ.13 కోట్ల వ్యయాన్ని రూ.20 కోట్లకు పెంచి అంచనాలు తయారుచేశారు. మళ్లీ స్థానికంగా మేజర్ ఫిషింగ్ హార్బర్ అవసరాన్ని గుర్తించి హార్బర్ కమ్ కార్గో పోర్ట్ నిర్మాణానికి రూ.429.43 కోట్ల భారీ వ్యయంతో పూనుకున్నారు. నిజానికి కేంద్ర ప్రభుత్వం హార్బర్ నిర్మాణం చేయాల్సి ఉంది. అయితే కేంద్రం హార్బర్ నిర్మాణానికి నిరాకరించడంతో ఇక్కడి ప్రజలకు ఇచ్చిన హామీ ఎట్టి పరిస్థితుల్లోనూ నెరవేర్చాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ నిధులతోనే హార్బర్ నిర్మాణానికి పూనుకోవడం విశేషం.

అభివృద్ధి చరిత్రలో మైలురాయి



బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్ నిర్మించాలని దశాబ్దాలుగా మత్స్యకారులు కోరుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలవతో పనులకు శంకుస్థాపన జరిగింది. నిజానికి కేంద్రం ఇక్కడ హార్బర్‌కు ఒప్పుకోలేదు. కానీ ఇక్కడి ప్రజలకు హామీ ఇచ్చామని చెప్పి సీఎం జగన్ నరసాపురంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి పూనుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వమే హార్బర్ నిర్మాణం చేసేలా స్వయంగా సీఎం శంకుస్థాపన చేశారు. పనులు ప్రాథమికంగా ప్రారంభమయ్యాయి. వచ్చే ఐదేళ్లలో నిర్మాణ పనులు పూర్తవుతాయి. గోదావరి జిల్లాల అభివృద్ధి చరిత్రలో ఇది ఓ మైలురాయి.

– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్ విప్

దేవుని చల్లని దీవెనలతో...

వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ఆదివారం చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రానున్న ఎన్నికల్లో వారికి విజయం చేకూరాలని భగవంతుడిని కోరుతూ పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మంచి చేసేవారికి ఆ దేవుని చల్లని దీవెనలు ఎప్పుడూ ఉంటాయని ఆశీర్వదించారు.



ఏలూరు టౌన్: ఏలూరు పెనూయేల్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని



ఏలూరు (ఆర్ఆర్ పేట): శాంతినగర్‌లోని మన్నా చర్చ్‌లో ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌ను ఆశీర్వదిస్తున్న బిషప్ ఎలీషారాజు, పాస్టర్ జ్యోతిరాజు



తణుకు టౌన్: వేల్పూర్పు చర్చిలో నిర్వహించిన ప్రార్థనల్లో పాస్టర్ల దీవెనలు పొందుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



భీమవరం (ప్రకాశం చౌక్): చర్చిలో విశ్వాసులను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

బ్రాహ్మణులకూ మంచి చేసిన సీఎం జగన్

రాష్ట్ర మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తణుకులో మంత్రి కారుమూరిని ఆశీర్వదిస్తున్న బ్రాహ్మణ సంఘ నాయకులు

తణుకు అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా వేలాది ఎకరాల భూమిని ప్రజాప్రయోజనార్థం ధారాదత్తం చేసిన బ్రాహ్మణులంటే తనకు ఎంతో గౌరవమని రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకులో ఆదివారం బ్రాహ్మణ సంఘ భవనంలో నిర్వహించిన బ్రాహ్మణ సంఘ ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్చకులు, పేద బ్రాహ్మణులకు ఎల్లవేలలా అండగా ఉన్నానని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో బ్రాహ్మణుల్లో పేదలకు మంచి జరిగిందని గుర్తుచేశారు. బ్రాహ్మణులను చట్టసభల్లోను, నామినేటెడ్ పదవుల్లో గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా ప్రాధాన్యత కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు మాత్రమే దక్కుతుందని దేవాదాయ శాఖ ప్రభుత్వ సలహాదారు జోలాపురం శ్రీకాంత్ అన్నారు. విజయవాడలో ఆలయాల కూల్చివేతకు పాల్పడిన ఘనుడు చంద్రబాబేనని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డికి బ్రాహ్మణ వర్గాలంతా అండగా ఉండాలని బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పేరి కామేశ్వరరావు (పీకే రావు) కోరారు. ముందుగా బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంత్రి కారుమూరిని సత్కరించారు. తణుకు బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు వద్దూరి సీతారాం అధ్యక్షతన నిర్వహించిన ఈకార్యక్రమంలో అఖిల భారత యువత విభాగం ఉపాధ్యక్షుడు సూరంపూడి కామేష్, బ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షులు బలిజేపల్లి రవిశంకర్, కార్యదర్శి వారణాసి పేరయ్యశాస్త్రి, నాయకులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల కోసం పనిచేసే వ్యక్తి జగన్

ఇరగవరం: ప్రజల కోసం పనిచేసే వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మంత్రి కారుమూరి అన్నారు. ఆదివారం ఇరగవరం నుంచి అర్జునుడుపాలెం, కంతేరు, పొదలాడ, కత్తవపాడు, కొత్తపాడు, రాపాక, యర్రాయిచెరువు, గోటేరు గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. అనంతరం ఇరగవరంలో పలు సంఘాలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కుల, మత, వర్గాలు చూడకుండా ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందించిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మంత్రి కారుమూరి చెప్పారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎం చేసుకోవాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు మాయమాటలను నమ్మవద్దని కోరారు. జెడ్పీటీసీ పంపన అంజిబాబు, ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు, పెన్మెత్స సుబ్బరాజు, కొప్పిశెట్టి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచార పర్వం

ప్రజలతో మమేకం

పల్లెపల్లెలో ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ప్రజలతో మమేకమవుతూ ముందుకు సాగుతున్నారు. తమ గ్రామాలకు వచ్చిన నేతలకు ప్రజలు హారతులు పడుతూ.. గజమాలలతో సత్కరిస్తూ ఆత్మీయ స్వాగతం పలుకుతున్నారు. సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని.. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించుకునే పూచీ తమదని భరోసా ఇస్తున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



మొగల్తూరు: పెద్దపల్లవపాలెంలో ఓ అవ్వ సమస్యలు వింటున్న నరసాపురం ఎమ్మెల్యే అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు



పెనుగొండ: సిద్ధాంతంలో దివ్యాంగురాలితో మాట్లాడుతున్న ఆచంట ఎమ్మెల్యే అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు



యలమంచిలి: యలమంచిలి మండలంలో ప్రచారం నిర్వహిస్తున్న పాలకొల్లు ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపి



భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరంలో ఎన్నికల ప్రచారంలో చిన్నారిని ముద్దాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



ఇరగవరం: అర్జునుడిపాలెంలో ర్యాలీలో ప్రజలను పలకరిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు




పెనుమంట్ర: ఎస్ ఇల్లిందలపర్రులో ప్రచారం నిర్వహిస్తున్న నరసాపురం ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాల

సంక్షేమ సారథికి అండగా నిలుద్దాం

రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం అర్బన్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించిన సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉందామని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని పెదగరువు, వెంప, శ్రీరామపురం గ్రామాల్లో మేమంతా సిద్ధం ఇంటింటికి ప్రచారం యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత 58 నెలల్లో రైతుభరోసా, డ్వాక్రా రుణమాఫీ, సున్నా వడ్డీ, అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, చేయూత, జగనన్న చేదోడు, పింఛన్‌లు వంటి నవరత్నాలతో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరిందన్నారు. సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చి ప్రతి పథకాన్ని వలంటీర్ల ద్వారా ఇంటికే నేరుగా అందించారన్నారు. ఇంటింటికీ సంక్షేమ పాలన అందించిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. తాను నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేశానన్నారు. పట్టణంలో రూ.130 కోట్లతో అభివృద్ధి చేసి రాష్ట్రంలో ఆదర్శంగా తీర్చిదిద్దానని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఓట్లను ఫ్యాన్ గుర్తుకు వేసి ఎమ్మెల్యే తనను, నరసాపురం ఎంపీగా గూడూరి ఉమాబాలను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్పీటీసీ కాండ్రేగుల నరసింహరాజు, మండల అధ్యక్షుడు తిరుమాని ఏడుకొండలు, జేసీఎస్ కన్వీనర్ కోమటి రాంబాబు, సీనియర్ నాయకులు అల్లూరి కృష్ణంరాజు, కలిదిండి మురళీకృష్ణంరాజు, కలిదిండి అప్పలరాజు, శ్రీరామపురం ఫణిరాజు, కలిదిండి సోమ సుందరరాజు, సానబోయిన సత్యనారాయణ, త్రిమూర్తులు, కొట్టి కుటుంబరావు, ఆరేటి పెద్దబ్బ తదితరులు పాల్గొన్నారు.



వెంపలో ప్రచారం నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్